(కత్తి ఆమె చేతికివ్వండి) చిన్న మోనోయాక్షన్ చేస్తే చాలు. ఎటువంటి కఠిన పాషాణహృదయిని ఐనా మూర్ఖవజ్రమేనా కరిగి నీరై ప్రవహిస్తుంది. ప్రవహించాలి - అది రూలు.

ఎగిరే పెళ్ళాం ఎప్పుడూ పాదదాసికాదు. ఆవిడ పాదరాణి అని గుర్తుంచుకుని జాగ్రత్తగా మెలగండి. సంసారంలోని గృహాభేదాలకు ఫస్టెయిడ్ బాక్సు గురించి మరోమారు రాస్తా-బై! బై!

# సీతమ్మ వాకిట సిరిమల్లె చెట్టు

కథల్లో ట్రాజిడీలు, వున్నట్టు అత్తగార్లలో కొందరు కమీడియన్లుగానూ మరి కొందరు ట్రెజీడియన్లుగానూ లోకంలో నెట్టుకొస్తూంటారు బ్రతుకులు. మన సొసైటీలో అత్తగారూ - సవిత్తల్లి ట్రెడిషినల్ సింబల్స్- ఆర్నెల్ల పసిపాపకు కూడా ముందు వచ్చే మాట "అత్త" - కాని లోకం ఎవరూ అత్తగార్ల గురించి ఒక్క మంచి ముక్క చెప్పిన పాపానపోయినట్లు కనబడదు. అత్తగార్లను దుష్టశక్తులుగా చిత్రించటం సర్వేసర్వత్రా రివాజయిపోయింది (చూడుడు- సూర్యకాంతం పిక్చర్స్). మన సామెతలలోనూ నీతులలోనూ సూక్తులలోనూ అత్తగారిని గురించి మంచి ఎక్కడా లేదు. (కార్టూనిస్టులు సరేసరి). హైపవర్ కమీషన్స్‌లాగా అత్తగార్లు అథారిటీకి సంకేతాలు.

కత్తి మెత్తనా అత్త మంచీ లేదని త్రోసిపారేశారు.

అత్తగారు "గార్లు" బాగా పండుతారు. కారపుగారె, వుల్లిగారె, వుత్తగారె, మసాళా గారె, బెల్లపుగారె మరియు నేతిగారె, గార్లలో ఎన్ని వెరైటీ లున్నాయో - ఫియట్, అంబాసిడర్, హెరాల్డ్, చెవర్లెట్, బ్రూక్స్, వాక్స్‌హాల్, స్టాండర్డ్ దిబ్బా దిరుగుండం అంటూ కార్లలోనూ అన్ని రకాలున్నాయి.

కాంగ్రెస్‌లో అతివాదులూ, మితవాదులూ, కమ్యూనిస్టుల్లో ఉగ్రవాదులూ అత్యుగ్ర వాదులూ అని వున్నట్లు అత్తగార్లలో కూరగాయ వాదులూ వూరగాయవాదులూ అని రెండు రకాలున్నారు. ఉభయ వర్గాలూ కత్తిపీట ముందేసుకు కూర్చుంటారు. కనుక అహింసావాదులు వూరగాయ వాదుల ఉద్ఘోష వినిపించుకోరు. కొందరికి కూరలంటే ముఖ్యం. మరి కొందరికి జాడీలూ రాచిప్పలే ముఖ్యం. కోడళ్ళకు కులకడం ముఖ్యం. అత్తలు అరగదీయాలని చూస్తుంటారు. చితికి పోయిన భూస్వామ్య వ్యవస్థకు కొస మెరుపులాటి గురుతు అత్తగారైతే కోడలు సుత్తీ, కొడుకు కొడవలి. కార్మికులకూ, యజమానులకూ మధ్య సంఘర్షణ తప్పనట్లు కోడళ్ళకూ అత్తలకూ మధ్య వర్గ పోరాటం తాలూకు స్వభావం దిగక తప్పదు. అప్పర్‌హవుసూ లోయర్ హవుసూ రెండూ రద్దు చేస్తేనే కాని మగాడికి సంసారంలో సుఖశాంతులు మృగ్యం.

ఎలక్షన్లే మన కంట్రీలో కుల, మత, వర్గ ప్రాతిపదికమీద జరుగుతున్నపుడు, మనదేశంలో ప్రేమ వివాహాలు దావాలకు దారితీసి తగలడిపోక తప్పదు. ఆస్తిపాస్తులున్నంతకాలం కట్నకానుకలనేవి ఏదో ఒక రూపంలో వుంటాయి. ఇచ్చి పుచ్చుకోడాల బేరసారాలు లేకుండా మ్యారేజి వ్యాపారం సాగదు. మంగళసూత్రం కట్టడానికి రేటుంటుంది. వివాహం బిజినెస్సయినప్పుడు దాంపత్యం సక్సెసెలాగవుతుంది? రిజిష్టర్ పెళ్లిళ్లు తప్ప మంగళ సూత్రం మ్యారేజిస్ చెల్లవని గవర్మెంట్ రూలు పాస్ చేస్తే తప్ప మనకి మోక్షం వుండదు. ప్రేమ వివాహాలనే గవర్మెంట్ ఆమోదించి, సొసైటీ వారిని భక్షించకుండా రక్షణలు కలిపించాలి. సొసైటీని రిఫారమ్ చేయకుండా దేశానికి రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, ప్రజలకు అది ఏ విధంగానూ ఉపయోగపడదని కనిపెట్టిన వాడు వీరేశలింగం పంతులుగారు. ఇందిరాగాంధీ హయాంలో అది రుజువు చేసి చూపిస్తున్నారు. సామాన్య ప్రజలు చూపిన ఆదరాభిమానాలకు నెహ్రూగారు తన హయాంలో సామాన్య ప్రజలకు చేసిన దేముంది? ఆయన చేయలేనిది ఆయన కూతురు మటుకేం చేస్తుంది? గాంధీగారు దేశంలోని దరిద్రనారాయణులందర్నీ ఈ మంత్రులగార్డియన్ షిప్‌లో వుంచి వెళ్ళారు. గార్డియనులు సర్వభక్షకులు కదా! వారి ఆకలితీరేదెప్పుడు? సామాన్యుడి కంటతడి ఆరేదెప్పుడు?

మొన్న ఫరీదాబాద్‌లో పెండాలు తగలబడిపోయిన మర్రోజున నిజలింగప్పగారు చెప్పిన సోషలిజం భారతీయ ఆధ్యాత్మిక సోషలిజమై వుంటుంది. పుట్టినప్పుడు మనుష్యులంతా ఒకటే చచ్చినప్పుడూ అంతే, ఈ మధ్యలో మాత్రం కాదు. ప్రీవీపర్స్‌లు చల్లగా వుండాలంటాడు యస్కేపాటిల్. ప్రభుత్వరంగాన్ని చెడగొట్టి ప్రయివేటు రంగాన్ని వుద్ధరిస్తామంటాడు రాజాజీ.

ప్రజాస్వామ్యంలో ప్రజల కర్మ ననుసరించి వారికి నాయకులు లభిస్తారు. నోట్ల వలన వోట్లు, పూర్వ జన్మసుకృతం వలన పదవులు నాయకులకు లభిస్తాయి. (భగవద్గీతలో అంతా సోషలిజమే. దాన్ని అడ్డటం ఎవరితరం?) ఎలక్షన్లకి ముందు వాగ్దానాలూ, అధికారంలోకి వచ్చాక పోలీసులు, లాఠీలు, బాష్పవాయు ప్రయోగాలు, తుపాకీ కాల్పులు యివే రాసిపెట్టి వున్నాయి ప్రజలకు.

ఈ వ్యవస్థను మార్చడం ఎంత కష్టమో ట్రెడిషనల్ అత్తగారిని మార్చడం కూడా అంతే కష్టం.

కోడలు కంటానంటే వద్దనే అత్త వుంటుందా? (సోషలిజాన్ని కంటానంటే ప్రభుత్వం వద్దనే అంటుందా?). పెనిమిటికి ఆశ ఆలిమీద పడక చాపమీద అన్నట్లు వుంది మన పరిస్థితి. నిజమే. ఆవుల్ని మళ్లించినవాడే అర్జునుడు. అర్జునుడు లాంటి నెహ్రూగారే ఆవుల్ని మళ్లించలేకపోయారు.

ఇష్టంలేని పెళ్ళాన్ని ఒసే అన్నా తప్పే అమ్మా అన్నా తప్పే. ఇప్పుడు మనదేశంలో సోషలిజం కావాలన్నా తప్పే! అక్కరలేదన్నా తప్పే? కళ్ళు రెండున్నా కనిపించేదొక్కటే కాబట్టి అందరికీ దృష్టి దానిమీదే వుంది. గుమ్మడి పాదులో చిక్కుకున్న పెళ్లికూతుర్లాగ రమ్మంటే ఎలా వస్తుంది? నిజలింగప్పగారు రమ్మంటే వస్తుందా?

"సీతమ్మ వాకిటా సిరిమల్లె చెట్టు. కొమ్మ వంచకుండ పూలు కోయండి" అన్నారు ప్రబుద్ధులు. సోషలిజం సీతమ్మ వాకిట వున్న సిరిమల్లె చెట్టు. మరి ఆపూలు ఎవరుకోస్తారో - ఆ దండ ఎవరు గుచ్చుతారో - అది పట్టికెళ్ళి సీతమ్మకిస్తే, రాముడి మెళ్ళో వేస్తుంది. రాముడు రడీగానే వున్నాడు. సీతమ్మ కూర్చుని ఎదురు చూస్తోంది. కొమ్మ వంచకుండా పూలుకోసి దండ కట్టేవారేరి?

# గంతుల మేస్టారు

ఈ రోజుల్లో మగాళ్ళ నందర్నీ మీది టెక్నికల్ సైడా మామూలా అని అడగడం కద్దు, యమ్మెస్సీ చదుకున్న గుంటనైనా "అమ్మాయీ నీ కెందరేః పిల్లలు" అనడుగుతారు. కాని నీది టెక్నికల్ సైడా అని ఆడగరడగరు. మగాడ్ని చూడగానే వీడెంత డబ్బు సంపాదిస్తాడూ (సంపాదించగలడూ) అనే చూస్తారు. కాని మరోటి మరోటీ (అందగాడా పేరు శేఖరా రాజశేఖరా అని) చూడరు. పడుచు పిల్లను చూడగానే మెళ్ళో పుస్తెలు మిల మిల లాడగానే యిది ఎంత మంది పిల్లల్ని కంటుందీ కనగలదూ, కన్నదీ తెలుసుకోవాలని తహ తహలాడి గేదెనుకాని ఆవునుకాని చూడగానే యిది ఎన్ని పాలిస్తుందీ ఎన్ని యీతలు యీనిందీ అని భోగట్టాలు చేస్తారు.

కొబ్బరిచెట్టును కాని, మరేదైనా పళ్ళ చెట్టునుగాని చూడగానే కాపు ఎంత అని అడుగుతారు అలాగే కాఫీ హోటల్ను చూడగానే యిక్కడ ఇడ్లీసైజు ఎంత వుంటుంది, కాఫీ బాగుంటుందా అనే సందేహం వస్తుంది. ఈ లోకంలో ఒక మనిషికాని వస్తువుకాని మనకు ఎంత వరకు ఉపయోగిస్తుందీ? మనకు లాభమా నష్టమా అనే యోచిస్తారుకాని మిగతా సంగతులన్నీ అన్నెససరీ.

కాని యిప్పుడిప్పుడే మన గృహ రాజ్యసీమలో కొత్త మార్పులు వస్తున్నాయి. టెక్నికల్, నాన్ టెక్నికల్ అని వంటింట్లోంచి కూడా వినిపిస్తోంది. గృహ టెక్నిక్స్‌ని అక్షరాలా అమలుపరచేది ఆడది కాబట్టి అటువంటి గృహరాక్షసిని, 'హోమో టెక్నికల్' అనొచ్చు (అలా వీల్లేని పక్షంలో టెక్నికాళి: టెక్నికల్‌రూపం ధరించిన ఆడకాళి అన్నా బైనోమీన్స్ ఫరవాలేదు) ఎవరెన్ని చెప్పినా మన వంటింటి సామ్రాజ్యంలో మగాడు కేతిగాడున్నూ ఆడది బంగారక్కాను. సారాచెంబు తాడులాగేది యిక్కడ మగాడు తలపూపేది పెళ్ళాం అనేటువంటి దినుసు (ఇంకా మీ కర్థంకాలేదా. అయితే మీదికూడా మా వారిదిలానే మట్టి బుర్ర. యాష్ట్రే అనగా దుమ్ము తట్ట దాన్ని దులిపితే మరేవీరాలదు.) నేను చాలా టెక్నికల్‌గా నడుస్తున్నట్లున్నాను. ఏవీ లేదండీ... యథా రాజా తథాప్రజా అన్నట్లు యథా మొగుడు తథాభార్యా అన్నారుకదా. చిన్న యగ్జాంపుల్.... మొగాడు ఇంజన్ డ్రయిరయితే వాడి ఆడది వాడిలో సగం కనుక (అర్ధాంగి) అది కూడా